శ్రీ దేవీ ఖడ్గమాలా స్తోత్రమ్

- భావార్థముతో -



సేకరణ: కిరణ్ టైప్ ఇనిస్టిట్యూట్, 41-1/8-13A.,
గౌతమీనగర్,3వ లైను, కృష్ణలంక, విజయవాడ-520 013.
https://madhirafamily.wordpress.com/

కిరణ్ టైప్ ఇన్స్టిట్యూట్

Kiron Type Institute

శ్రీ దేవీ ఖడ్గమాలా స్తోత్రమ్ - భావార్థముతో.

ధ్యానమ్:

హ్రీంకారాసనగర్భితానలశిఖాం। సౌః క్లీః కళాం బిభ్రతీం।
సౌవర్ణాంబరధారిణీం వరసుధాధౌతాం త్రినేత్రోజ్జ్వలామ్॥

- - - - - - -

వందే పుస్తకపాణిమంకుశధరాం స్రగ్భూషితాముజ్జ్వలాం।
త్వాం గౌరీం త్రిపురాం పరాత్పరకళాం శ్రీచక్రసంచారిణీమ్॥

- - - - - - -

ఓం ఐం హ్రీం శ్రీం ఐం క్లీం సౌః

01. ఓం నమః త్రిపురసుందరీ, హృదయదేవీ,
శిరోదేవీ, శిఖాదేవీ, కవచదేవీ, నేత్రదేవీ

త్రిపురసుందరీ దేవికి వందనములు. హృదయాధి దేవతకు - చక్రరాశియందు శిరోపరిభాగములో బిందు స్థానములో తేజరిల్లు దేవికి - భక్తజనులకు చూడామణి వలే తేజరిల్లు దేవికి - భక్తజనులను రక్షించుటకు కవచ స్వరూపాన్ని ధరించిన పరమేశ్వరికి - కరుణా కటాక్ష వీక్షణాలతో భక్తులను కాపాడునట్టి మహేశ్వరికి వందనములు.

- - - - - - -

02. అస్త్రదేవీ, కామేశ్వరీ, భగమాలినీ, నిత్యక్లిన్నే, భేరుండే,

అస్త్రస్వరూపిణియైన జగన్మాతకు - శంకరుని అర్ధాంగి యై భక్తుల కోరికలను నెరవేర్చు నట్టి కామేశ్వరి స్వరూపిణికి - భగవత్ గుణాలను మాల రూపంలో ధరించిన భగమాలినీ మాతకు - శుక్లపక్ష తృతీయా తిథికి దేవత యగు నిత్య క్లిన్నా దేవికి - శ్రీచక్ర మేరువులో నవమావరణలో చతుర్థాన్వితా దేవతా స్వరూపిణియగు భేరుండాదేవికి ప్రణతులు.

- - - - - - -

Kiron Type Institute
కిరణ్ టైప్ ఇన్స్టిట్యూట్

03. వహ్నివాసినీ, మహావజ్రేశ్వరీ,
శివదూతీ, త్వరితే, కులసుందరీ,

చక్ర త్రికోణములో నివసిస్తూ వహ్ని మండలాంతర్వర్తినిగా భాసిల్లు రుద్రాణి స్వరూపిణికి – శుక్ల షష్ఠీ తిథికి అధీశ్వరి, పిండాండములో విశుద్ధ చక్రానికి అధిష్టాత్రి, త్రికోణాకారములో అధిష్టానదేవతయగు మహావజ్రేశ్వరికి – శుంభ, నిశుంభుల వద్దకు శివుని దూతగా పంపబడిన, శుక్లపక్ష సప్తమీ తిథికి అధిష్టాత్రియైన శివదూతికి – భక్తులకు శీఘ్రగతిని ముక్తిని ప్రసాదించు త్వరితాదేవికి – విద్యాకులంలో సుందర స్వరూపిణిగా భాసిల్లునట్టి కులసుందరీ దేవికి సమస్కారములు.

– – – – – –

04. నిత్యే, నీ(ని)లపతాకే, విజయే,
సర్వమంగళే, జ్వాలామాలినీ, విచిత్రే, శ్రీవిద్యే

నిత్య తిథుల రూపముతో భాసిల్లునట్టిదియు, ఆదిమధ్యాంతాలు లేనట్టిదియు అగు జననికి – నీల వర్ణముగల పతాకముతోగల రథాన్ని అధిరోహించిన తల్లికి – రక్కసి మూకలను అంతముచేసి విజయ రూపిణియై తేజరిల్లు మాతకు – భక్తులకు శుభములను ప్రసాదించునట్టి శ్రీదేవికి – జ్వాలామాలినీ స్వరూపిణిగా ప్రతిమాసంలో శుక్లచతుర్దశి, బహుళ తిథులకు అధిష్టాత్రిగా తేజరిల్లు జగదంబకు – విచిత్ర స్వరూపముగల పరమేశ్వరికి నమోవాకములు.

– – – – – –

05. మహానిత్యే, పరమేశ్వర పరమేశ్వరీ,
మిత్రేశమయీ, షష్ఠీశమయీ, ఉడ్డీశమయీ,

సర్వకాల సర్వావస్థలలోను స్థిరముగనుండు మహానిత్య స్వరూపిణియగు మాతకు – శివ–శక్తి భేదాతీతురాలగు పరమేశ్వర పత్నియగు పరదేవతకు – భక్తులకు యశస్సును కలిగించు మైత్రీభావముగల జగజ్జననికి, ఉడ్డీశక్తి రూపిణి అయిన మాతకు, షష్ఠీ దేవతా శక్తి స్వరూపిణి అయిన జగన్మాతకు వందనములు.

– – – – – –

06. చర్యానాథమయీ, లోపాముద్రమయీ,
అగస్త్యమయీ, కాలతాపనమయీ,

సృష్టి, స్థితి, సంహారాదులు కలిగించే సమస్త చర్యలకు హితభూతురాలైన దేవికి – లోపాముద్రునిచే పూజించబడిన శ్రీదేవికి, అగస్త్యమునిచే పూజింపబడిన శ్రీదేవికి – సృష్టి, స్థితి సంహార కారణాలగు దుఃఖతాపాదులకు అతీతురాలై విలసిల్లు పరదేవతకు వందనములు.

- - - - - -

07. ధర్మాచార్యమయీ, ముక్తకేశీశ్వరమయీ,
దీపకలానాథమయీ,

ధర్మవర్తనులకు ముక్తిని ప్రసాదిస్తూ అధర్మాన్ని నాశనము చేయునటప్టి అంబకు – నీలవర్ణముతో సుదీర్ఘ కేశపాశము కలిగి తాపత్రయదూరురాలగు శ్రీమాతకు, అజ్ఞానాంధకారాన్ని రూపుమాపు జ్ఞానజ్యోతి స్వరూపురాలగు పరమేశ్వరికి వందనములు.

- - - - - -

08. విష్ణుదేవమయీ, ప్రభాకరదేవమయీ,
తేజోదేవమయీ, మనోజదేవమయీ,

నారాయణ స్వరూపిణియైన శ్రీదేవికి – భాస్కర మండలములోని మార్తాండ భైరవ స్వరూపిణియైన మాతకు – సూర్యచంద్రాగ్నులకు కూడా తేజస్సును ప్రసాదించు తేజోస్వరూపిణికి – మన్మథ స్వరూపిణియైన శ్రీదేవికి వందనములు.

- - - - - -

09. కళ్యాణదేవమయీ, వాసుదేవమయీ,
రత్నదేవమయీ, శ్రీరామానందమయీ,

మంగళకారక కళ్యాణ స్వరూపిణియైన మాతకు – కృష్ణ భగవద్రూపిణియైన శ్రీదేవికి – రత్నాలు పొదిగిన ముత్యాల మణిహారాన్ని, రత్నాలు పొదిగిన బంగారు గంటలుతో కూడిన మొలత్రాడును ధరించిన దేవికి – నిత్యానంద లక్షణములు కలిగి జనహృదయార విందములను వికసింపజేయునట్టి పరదేవతకు వందనములు.

\- - - - - -

10. అణిమాసిద్ధే, లఘిమాసిద్ధే,
గరిమాసిద్ధే, మహిమాసిద్ధే,

అణిమాసిద్ధి స్వరూపిణియై భక్తులకు తత్సిద్ధిని ప్రసాదించగల జననికి – లఘిమాసిద్ధి స్వరూపిణియై భక్తులకు తత్సిద్ధిని ప్రసాదించగల జననికి – గరిమాసిద్ధి స్వరూపిణియై భక్తులకు తత్సిద్ధిని ప్రసాదించగల కరుణామూర్తియైన మాతకు, మహిమాసిద్ధి స్వరూపిణియై భక్తులకు తత్సిద్ధిని ప్రసాదించునట్టి అపారకరుణా సముద్రురాలైన తల్లికి వందనములు.

\- - - - - -

11. ఈశిత్వసిద్ధే, వసిత్వసిద్ధే,
ప్రాకామ్యసిద్ధే, భుక్తిసిద్ధే,

ఈశిత్వసిద్ధి స్వరూపిణియై భక్తులకు తత్సిద్ధిని ప్రసాదించునట్టి అపారకరుణా సముద్రురాలైన తల్లికి – వసిత్వసిద్ధి స్వరూపిణియై శ్రీఘ్రగతిని భక్తులకు వశమగునట్టి జననికి – ప్రాకామ్యసిద్ధి స్వరూపిణియై నిజభక్తుల అభీష్టాలను నెరవేర్చునట్టి మాతకు – భుక్తిసిద్ధి స్వరూపిణియై భక్తజనావళికి భుక్తిని ప్రసాదించు తల్లికి వందనములు.

\- - - - - -

12. ఇచ్ఛాసిద్ధే, ప్రాప్తిసిద్ధే, సర్వకామ్యసిద్ధే, బ్రాహ్మీ,

ఇచ్ఛాసిద్ధి స్వరూపిణియై భక్తుల కోరికలు నెరవేర్చునటువంటి శ్రీదేవికి – ప్రాప్తిసిద్ధి స్వరూపిణియై భక్తలోకానికి బ్రహ్మజ్ఞానాన్ని ప్రాప్తింపజేయు మాతకు – సమస్త కోరికలనూ తీర్చునటువంటి మాతకు – సరస్వతీ స్వరూపిణియగు మాతకు ప్రణతులు.

\- - - - - -

13. మాహేశ్వరి, కౌమారి, వైష్ణవీ,
వారాహీ, మాహేంద్రీ, చాముండీ,

లయ కారిణియైన మహేశ్వరీ స్వరూపిణియగు మాతకు – షోడశవర్ష ప్రాయముతో తేజరిల్లు కౌమారీశక్తి స్వరూపిణియైన మాతకు – స్వభావము వల్ల విష్ణు స్వరూపిణియైన మాతకు – వారాహిణిగా భాసిల్లు మాతకు, శక్తి రూపిణిగా తేజరిల్లు మాతకు, అసురులను అంతము చేయడానికి చాముండి రూపాన్ని ధరించి లోకాలకు మేలు చేసిన మాతకు వందనములు.

– – – – – – –

14. మహాలక్ష్మీ, సర్వసంక్షోభిణీ,
సర్వవిద్రావిణీ, సర్వాకర్షిణీ,

కొల్హాపుర పీఠాధిష్ఠాత్రియైన అష్టలక్ష్మీ స్వరూపిణికి – తాను నాశనం కాకుండా ప్రళయవేళలో మహా సంక్షోభాన్ని చెలరేగించు మాతకు – సర్వవిద్రాశక్తి స్వరూపిణియగు మాతకు – సర్వాన్నీ ఆకర్షించునట్టి అఖిలలోకాశ్చర్యకర సౌందర్యరాశియైన శ్రీదేవికి ప్రణతులు.

– – – – – –

15. సర్వవశంకరీ, సర్వోన్మాదినీ,
సర్వమహాంకుశే, సర్వఖేచరీ,

ప్రపంచమును వశము చేసుకొనునట్టియు, భక్తలోకమునకు వశమగునట్టి పరమేశ్వరికి – కల్లోలాన్ని సృష్టించు జగన్మాతకు – మహాంకుశాన్ని ధరించి దుర్మార్గులను నాశనము చేయునట్టి జగన్మాతకు – ఖేచరీ శక్తి స్వరూపిణియగు జననికి వందనములు.

– – – – – –

16. సర్వబీజే, సర్వయోనే, సర్వత్రిఖండే,
త్రైలోక్యమోహన చక్రస్వామినీ,

సమస్త మంత్రముల బీజస్వరూపిణియై భాసిల్లు మాతకు - చక్రాంతర్గత త్రికోణములో భాసిల్లు యోనీశక్తియైన బిందు స్వరూపిణికి - వాగ్భావ కామరాజ శక్తి కూటములనే త్రిఖండ స్వరూపిణియైన దేవికి - దేవతాకార స్వరూపురాలైన చక్రా లన్నింటికన్నా శ్రేష్టమైన శ్రీచక్రములో భాసిల్లుతూ ముల్లోకాలను మోహపరచునటువంటి శ్రీదేవికి వందనములు.

\- - - - - -

17. ప్రకటయోగినీ, కామాకర్షినీ,
బుద్ధ్యాకర్షినీ, అహంకారాకర్షినీ,

బ్రహ్మజ్ఞాన యోగాన్ని ప్రకటింపజేయునట్టి యోగినీ మాతకు - కామమును ఆకర్షించునదియు, ప్రసాదించగల సమర్థత కల్గిన శ్రీమాతకు - బుద్ధిని ఆకర్షించి బ్రహ్మజ్ఞాన ప్రదాయినియగు శ్రీదేవికి, భక్తజనుల అహంకారిన్ని రూపుమాపి వారు పతనకూపంలో పడకుండా జ్ఞానాన్ని ప్రసాదించు పరదేవతకు వందనములు.

\- - - - - -

18. శబ్దాకర్షిణీ, స్పర్శాకర్షిణీ,
రూపాకర్షిణీ, రసాకర్షిణీ,

శబ్ధస్వరూపిణియై ఓంకార మూర్తియై భక్తులకు బ్రహ్మజ్ఞానోపదేశము చేయునట్టి తల్లికి - స్పర్శాకర్షణచే భక్తులకు ముక్తిని ప్రసాదించు తల్లికి - రూపాకర్షణతో భక్తులకు సౌందర్యాన్ని ప్రసాదించు తల్లికి - సర్వులనూ ఆకర్షించ గలుగునట్టి నవరస స్వరూపిణి యగు దేవికి వందనములు.

\- - - - - -

19. గంధాకర్షిణీ, చిత్తాకర్షిణీ,
ధైర్యాకర్షిణీ, స్మృత్యాకర్షిణీ,

సర్వ సుంగంధాల్పంచిరుకర లేపనాదులయందు విశేష ఆకర్షణ కలిగియుండు తల్లికి - భక్తులకు నిశ్చలత్వాన్ని ప్రసాదించు మాతకు - భక్త జనులకు ధైర్య సాహసాదులను ప్రసాదించు తల్లికి - భక్తుల స్మరణ శక్తిని వర్ధిల్లజేయు మాతకు వందనములు.

\- - - - - -

20. నామాకర్షిణీ, బీజాకర్షిణీ, ఆత్మాకర్షిణీ, అమృతాకర్షిణీ,

నామపారాయణాశ్రితియై భక్తుల అభీష్టాలను నెరవేర్చు మాతకు - బీజ స్వరూపాన్ని ఆకర్షించి దర్శనమిచ్చు జననికి - ఆత్మ స్వరూపాన్ని ఆకర్షించి అమృతతత్వాన్ని ప్రసాదించు పరమాత్మ స్వరూపిణికి - అమృతావర్తియై సాధకులకు అమృతతత్వాన్ని ప్రసాదించు జననికి వందనములు.

\- - - - - -

21. శరీరాకర్షిణీ, సర్వాశాపరిపూరక చక్రస్వామినీ, గుప్తయోగినీ,

దేహములోని నాడీమండల రూపములో భక్తులకు శక్తిని ప్రసాదించు పరదేవతకు - శ్రీచక్రస్వామినియగు పరదేవతని ఆరాధించిన వారికి శీఘ్రముగ సమస్తమైన ఆశలు సిద్ధింపజేయు సర్వాశాపరిపూరకునాలకు శ్రీలలితాంబకు, మూలాధార చక్రములో యోగినీ దేవతల మధ్య గుప్తముగా సంచరిస్తూ వారికి అధిదేవతగా ఉండు గుప్తయోగినీ దేవికి వందనములు.

\- - - - - -

22. అనంగ కుసుమే, అనంగ మేఖలే,
అనంగ మదనే, అనంగ మదనాతురే,

అనంగకుసుమా స్వరూపిణియగు శ్రీదేవికి - అనంగమేఖలాదేవికి - ముక్కంటి కంటి మంటకు అనంగుడైన మదనుని అనుగ్రహించిన మాతకు - నిజ సౌందర్యం మాత్రముచే యోగీశ్వరుడైన శంకరుని కూడా మదన ప్రభావితుని గావించిన అపూరూప సౌందర్యరాశియైన జగదీశ్వరికి ప్రణతులు.

\- - - - - -

23. అనంగ రేఖే, అనంగ వేగినీ,
అనంగ అంకుశే, అనంగ మాలినీ,

మన్మథ రేఖలతో విలసిల్లు దివ్యాంగాలు గల శ్రీదేవికి, ఊహాతీత తీవ్ర వేగముగల సర్వ వ్యాపినియగు జగన్మాతకు - అంకుశాయుధ ధారిణియగు శ్రీమాతకు - అకారాంతముగా గల వర్ణమాలా స్వరూపిణియగు పరదేవతకు ప్రణతులు.

- - - - - -

24. సర్వ సంక్షోభణచక్రస్వామినీ,
గుప్తతరయోగినీ, సర్వసంక్షోభిణీ,

ప్రళయకాలములో సర్వసంక్షోభాన్ని కలిగించునట్టి చక్రస్వామినికి - మూలాధార చక్రములో రహస్యాతి రహస్యంగా సంచరిస్తూ ఆరాధ్యదేవతలగు యోగినులకు అధీశ్వరియై భాసిల్లు పరమేశ్వరికి - తాను నిత్యం తేజరిల్లుతూ చరాచర జగత్తును లయ వేళల్లో కల్లోలపరచునట్టి సర్వసంక్షోభిణీ స్వరూపిణికి వందనములు.

- - - - - -

25. సర్వ విద్రావినీ, సర్వాకర్షిణీ,
సర్వహ్లాదినీ, సర్వసంమోహినీ,

సర్వ జీవరాశిని నాశనము చేయునట్టి జగదాంబకు - సర్వులనూ ఆకర్షించునట్టి దివ్య సుందర రూపిణియగు శ్రీదేవికి - భక్త జనులకు ఆహ్లాదము కలుగజేయునట్టి పరమేశ్వరికి - సర్వులను సమ్మోహింపజేయగల శక్తి స్వరూపిణియగు పరమేశ్వరికి వందనములు.

- - - - - -

26. సర్వ స్తంభినీ, సర్వజృంభిణీ,
సర్వవశంకరీ, సర్వరంజనీ,

యావత్ విశ్వాన్నీ స్తంభింపజేయునట్టి స్వరూపిణికి - సంహారంలో విజృంభించి వీరవిహారము చేయునట్టి జృంభిణీ స్వరూపిణియగు జగదంబకు - సర్వాన్నీ స్వాధీనము చేసుకొని భక్తజన సర్వస్వానికి వశంకరియై ముక్తిని ప్రసాదించు శ్రీదేవికి - యావత్ విశ్వాన్నీ రంజింపజేయునట్టి అఖిలేశ్వరికి వందనములు.

- - - - - -

27. సర్వోన్మాదినీ, సర్వార్థసాధికే,
సర్వసంపత్తిపూరణీ, సర్వమంత్రమయీ,

యావద్విశ్వాన్నీ భ్రమింపజేసి ఉన్మాదస్థితిలో ముంచెత్త గలుగునట్టి అఖిలేశ్వరికి - భక్తజనుల సమస్త ప్రార్థనలు మన్నించి వారి అభీష్టాలను నెరవేర్చునట్టి తల్లికి - తనను ఆరాధించు భక్తులకు సమస్త సంపదలూ ప్రసాదించు పరమేశ్వరికి సమస్త మంత్రములకు తానే అధిష్టాత్రియైన దేవికి వందనములు.

- - - - - -

28. సర్వద్వంద్వక్షయంకరీ, సర్వసౌభాగ్యదాయక చక్రస్వామినీ,
సంప్రదాయయోగినీ,

సమస్తమైన బేదభావాలను దూరంచేసి భక్తులకు అద్వైత తత్వాన్ని ప్రసాదించు కరుణామూర్తికి - తన ప్రియ భక్తులకు సర్వసౌభాగ్యాలను అనుగ్రహించునట్టి జననికి - గురు శిష్య సంప్రదాయ పరంపరయందు ఉపాసింపబడు యోగినీ దేవతయగు శ్రీలలితాంబకు వందనములు.

- - - - - -

29. సర్వసిద్ధిప్రదే, సర్వసంపత్ప్రదే, సర్వప్రియంకరీ,

భక్తజనులకు అష్టసిద్ధులను ప్రసాదించగల సమర్థురాలైన జగదంబకు - భక్తులకు సర్వసంపదలను ప్రసాదించు మాతకు - తన భక్తులకు మంచిని చేరూర్చునట్టి ప్రేమ మూర్తికి వందనములు.

- - - - - -

30. సర్వమంగళకారిణీ, సర్వకామప్రదే, సర్వదుఃఖవిమోచినీ,

తాను నిత్య కళ్యాణియై తనను స్మరించు భక్తులకు సమస్త శుభములను చేకూర్చునట్టి మాతకు - తనను ఆరాధించువారి సర్వకామనలను సిద్ధింపజేయునట్టి పరదేవతకు - తనను స్మరించిన భక్తుల దుఃఖాలను రూపుమాపునట్టి జననికి వందనములు.

\- - - - - -

31. సర్వమృత్యుప్రశమనీ, సర్వవిఘ్ననివారిణీ,
సర్వాంగసుందరీ,

అకాలమృత్యువు, అపమృత్యువు, మృత్యువు ఆదిగా గల మృత్యువులను తన భక్తులకు రాకుండా కాపాడి జన్మాంతంలో అమృతత్వాన్ని ప్రసాదించు దేవికి - తనను సేవించు భక్తులకు ఆరాధన, ఉపాసన, సత్కర్మానుష్టానాదులలో ఎట్టి విఘ్నములూ కలుగకుండా కాపాడు తల్లికి - సర్వాంగ సౌందర్యరాశియై విలసిల్లు పరమేశ్వరికి వందనములు.

\- - - - - -

32. సర్వసౌభాగ్యదాయినీ, సర్వార్థసాధకచక్రస్వామినీ,
కులోత్తీర్ణయోగినీ,

భక్తులైన పుణ్యాత్ములకు సమస్తమైన సౌఖ్యాలను ప్రసాదించు శ్రీదేవికి - శ్రీచక్ర అధిష్టానదేవతయై తనను అర్చించు భక్తులకు సర్వార్థములను ప్రసాదించు దేవికి - చక్రములో విరాజిల్లే నవావరణ దేవతలను యోగినులు అంటారు. వారందరూ పరమేశ్వరీ స్వరూప అంశామూర్తులు. వారందరికీ అధీశ్వరియై బిందురూపముతో తేజరిల్లే పరాశక్తియే కులయోగిని అట్టి మాతకు వందనములు.

\- - - - - -

33. సర్వజ్ఞే, సర్వశక్తే, సర్వైశ్వర్యప్రదాయినీ,
సర్వజ్ఞానమయీ,

సర్వమూ తెలిసిన జ్ఞానమూర్తికి – సృష్టి, స్థితి, సంహారములను చేయగలిగి నట్టియు, భక్తులకు సర్వ శక్తులను ప్రసాదించు మహాశక్తికి – నిశ్చల హృదయముతో ఆరాధించు తన భక్తులకు సర్వైశ్వర్యములను ప్రసాదించు పరమేశ్వరికి – తనను ఉపాసించు భక్తులకు బ్రహ్మజ్ఞానాదులను ప్రసాదించు పరమేశ్వరికి వందనములు.

\- - - - - -

34.సర్వవ్యాధి వినాశినీ, సర్వాధార స్వరూపే,
సర్వపాపహరే,

భక్తుల మానసిక వ్యాధులన్నింటినీ రూపుమాపు జననికి – సృష్టి, స్థితి, లయలకు, సర్వజీవరాశికి ఆధార స్వరూపిణియైన పరమేశ్వరికి, భక్తులయొక్క సమస్త పాపములను హరించునట్టి మాతకు వందనములు.

\- - - - - -

35.సర్వానందమయీ, సర్వ రక్షాస్వరూపిణీ,
సర్వేప్సిత ఫలప్రదే, సర్వరక్షాకరచక్రస్వామినీ,

భక్తులకు సమస్త ఆనందములనూ ప్రసాదించునట్టి మాతకు – భక్తులను సమస్త ఆపదలనుండీ కాపాడునట్టి మాతకు – నామ స్మరణ మాత్రాన భక్తుల కోరికలను తీర్చు మాతకు – శ్రీచక్రాధిష్టాన దేవతయై భక్తులను సర్వవిధములా కాపాడు శ్రీలలితా పరమేశ్వరికి వందనములు.

\- - - - - -

36. నిగర్భయోగినీ, వశినీ, కామేశ్వరీ,
మోదినీ, విమలే, అరుణే,

యోనికూట స్వరూపిణియైన దేవికి - వశినీశక్తి స్వరూపిణి యగు మాతకు - అనంగుని ద్వారా ఉపాసించబడిన కామ విద్యా స్వరూపిణియగు కామేశ్వరికి - నామ పారాయణ మాత్రముచే తృప్తిచెందు దేవికి - శుద్ధసత్వ రూపిణియై దశ సంస్కార రహితయైన విమలాదేవికి - బాల భాస్కర సమమగు అరుణవర్ణం కలిగి, అరుణ వస్త్రాన్ని ధరించి మందారాది అరుణ పుష్పాలయందు ప్రీతికల దేవికి వందనములు.

\- - - - - -

37. జయినీ, సర్వేశ్వరీ, కౌళినీ,
సర్వరోగహర చక్రస్వామినీ,

జయస్వరూపముగా కలిగి భక్తులకు జయాలను ప్రసాదించు తల్లికి - చరాచర విశ్వానికి సృష్టి స్థితి సంహారాలు చేయునట్టి త్రిమూర్తులకు సైతము ఈశ్వరియైన సర్వేశ్వరికి - శివశక్త్యాత్మక సూచికయైన కౌళినీ మాతకు - శ్రీచక్రాధిష్ఠాతయై తేజరిల్లుతూ తన ఉపాసకులకు రోగములు రాకుండా కాపాడునట్టి, జన్మాంతరాది వ్యాధులను సైతం రూపమాపునట్టి మహేశ్వరికి వందనములు.

\- - - - - -

38. రహస్యయోగినీ, బాణినీ, చాపినీ,
పాశినీ, అంకుశినీ, మహాకామేశ్వరీ,

చక్రాంతర్గత నవావరణ దేవతలలో గల రహస్యయోగినీ బృందానికి అధిష్ఠాత్రియైన మాతకు - బాణములు దాల్చి భక్తులను రక్షించు మాతకు - చాపాయుదణికి, - భవబంద పాశములను అంతము చేయు మాతకు - అంకుశాయుధాన్ని దాల్చిన శ్రీలలితాంబకు - సర్వ వాంఛలనూ నెరవేర్చు మహా మహేశ్వరుని హృదయేశ్వరియైన మాతకు వందనములు.

\- - - - - -

39. మహావజ్రేశ్వరీ, మహాభగమాలినీ
సర్వసిద్ధిప్రద చక్రస్వామినీ,

శుద్ధష్టతిథికి అధిష్టాన దేవతయైన మహావజ్రేశ్వరీ నామక దేవికి – ఐశ్వర్యాలను, ద్వాదశాదిత్యులను మాలగా ధరించిన మహాభగమాలినీ దేవికి – తనను సేవించునట్టి శ్రీవిద్యోపాసకులకు సర్వసిద్ధులనూ ప్రసాదించు బిందుస్థాన విరాజమానయగు జగన్మాతకు వందనములు.

\- - - - - -

40\. అతి రహస్యయోగినీ, శ్రీశ్రీ మహాభట్టారికే,
సర్వానందమయ చక్రస్వామినీ,

శ్రీచక్ర నవావరణలలో అతి రహస్యముగా విహరించునట్టి రహస్యయోగినులకు అధీశ్వరియై భాసిల్లు దేవికి – శక్తి స్వరూపిణుల చేతను, కౌశిక, దుర్గాది శక్తుల చేతనూ సేవింపబడుచూ వారిచే పరివేష్టితురాలై సింహాసనాన్ని అధిష్టించిన శ్రీలలితా పరాబట్టారికకు – శ్రీచక్రస్వామినియై ఉపాసకులైన వారికి సర్వానందాలనూ ప్రసాదించు సర్వానందమయ స్వరూపిణియగు శ్రీలలితా మాతకు వందనములు.

\- - - - - -

41\. పరాపర రహస్యయోగినీ, త్రిపురీ, త్రిపురేశీ,

ఆద్యంతరహితయై, వాటికి హితభూతురాలై, అతి రహస్యముగా విహరించునట్టి, సాధారణులకు గోచరము కానట్టి పరమేశ్వరికి – త్రిపురసుందరీ స్వరూపిణి, సృష్టి, స్థితి, సంహారములకు కూడా పూర్వములో తేజరిల్లు ఆదిపరాశక్తియైన మాతకు – స్థూల, సూక్ష్మ, కారణ శరీరాలకు, త్రిపురాలకూ అధీశ్వరియైన పరమేశ్వరికి వందనములు.

\- - - - - -

42\. త్రిపురాసిద్ధే, త్రిపురాంబా,
మహాత్రిపురసుందరీ, మహామహేశ్వరీ,

త్రిపురాలలోని అష్టసిద్ధులను తన సాధకులకు, ఉపాసకులకు ప్రసాదించు మాతకు – జగత్రయ, గుణత్రయ, పురత్రయ, దేహత్రయ, మూర్తిత్రయాదులకు జననియైన

మాతృదేవికి, త్రిపురసుందరీ స్వరూపిణియైన మహామాతకు – మహేశ్వరుని ప్రాణశక్తి స్వరూపిణియై అనంతకోటి బ్రహ్మాండాల సృష్టి, స్థితి, సంహారములకు, నిర్వహణాదులకు కారణ స్వరూపిణియైన పరమేశ్వరికి వందనములు.

- - - - - -

43. మహామహారాజ్ఞీ, మహామహాశక్తే,
మహామహాగుప్తే, మహామహాజ్ఞప్తే,

చరాచర విశ్వాలకు దేవతయైన మహారాజ్ఞి స్వరూపిణికి – మహత్తరాతి మహత్తర శక్తిరూపిణియైన శ్రీలలితామాతకు – సృష్టికారణ బీజ సర్వస్వాన్నీ తనలో గుప్త పరచుకొనునట్టి జగదీశ్వరికి – అనంత శక్తిగల మాతకు వందనములు.

- - - - - -

44. మహామహానందే, మహామహాస్కంధే, మహామహాశయే,

మహత్తరాతి మహత్తరానందమూర్తియై సాధక సందోహానికి మహానందాన్ని ప్రసాదించు మాతకు – మహత్తరాతి మహత్తరమైన భుజస్కంధాలతో భాసిల్లు పరమేశ్వరికి – సర్వోత్కృష్ట ఆశయాలు కలిగినదై తన ఉపాసకులకు సదాశయాలను నెరవేర్చునట్టి దేవికి వందనములు.

- - - - - -

45. మహామహా శ్రీచక్రనగర సామ్రాజ్ఞీ,
నమస్తే, నమస్తే, నమస్తే, నమః॥

సర్వోత్కృష్ట యంత్రరాజమైన శ్రీచక్ర మహానగరానికి సామ్రాజ్ఞియై భాసిల్లు శ్రీ రాజరాజేశ్వరీ పరదేవతకు వందనములు.

- - - - - -

శ్రీ దేవీఖడ్గమాలా స్తోత్రమ్ సంపూర్ణమ్

– – – = – – –

కిరణ్ టైప్ ఇన్‌స్టిట్యూట్



Kiron Type Institute